క్లుప్తంగా

డాక్టర్ 'గద్దె'కు ఘన నివాళి



తెనాలిరూరల్: పట్టణానికి చెందిన గుండె వైద్య నిపుణుడు డాక్టర్ గద్దె శివనాగమల్లేశ్వర రావు శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు ఘన నివాళు లర్పించారు. స్థానిక బోస్‌రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో శనివారం సాయంత్రం డాక్టర్ శివనాగమల్లేశ్వరరావు చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె. అనిల్ కుమార్, డాక్టర్ మధు ప్రభా కర్ బాబు, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కె. శ్యాం ప్రసాద్, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ కోటినాగయ్య, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ నరసింహారావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

తెనాలిలో భారీ వర్షం

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తెనాలి: పట్టణ, పరిసరాల్లో శనివారం సాయంత్రం కొద్దిసేపు భారీ వర్షం కురిసింది. దీనికితోడు వీచిన గాలులతో వేసవి ఉక్కపో తకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు వర్షంతో ఉపశ మనం కలిగినా, విద్యుత్ అంతరాయంతో పరిస్థితి మొదటికొచ్చింది. బయట చల్లగా ఉన్నా ఇళ్లలో ఉక్కపోత, ఎంతకీ పునరుద్ధరిం చని విద్యుత్ సరఫరా కారణంగా జనం తీవ్ర అసహనానికి గురయ్యారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో వర్షం చినుకులు మొదలు కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పట్ట ణంలోని నందులపేట, నాజరుపేట, బుర్రి పాలెంరోడ్డు ఏరియాల్లో కరెంటు లేక అవస్థలు పడ్డారు. రాత్రి 9.30 గంటలక్కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు. కరెంటు ఎప్పటికి వస్తుందో తెలుసుకుందామని ఫోన్ చేసిన వినియోగదారులకు సంబంధిత అధికా రులు అందుబాటులోకి రాకపోవటంతో ఏమీ పాలుపోని పరిస్థితి నెలకొంది. ఆయా ఏరి యాల్లో ఎప్పుడు చినుకులు పడినా విద్యుత్ సరఫరా ఆగిపోవటం, పునరుద్ధరణకు తీవ్ర జాప్యం జరుగుతుండటంపై స్థానికులు విమ ర్శిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలా జరగనేలే దని, ఇటీవలకాలంలోనే ఈ రకమైన అవస్థలు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. దీనిపై విద్యుత్ ఏడీఇ అశోక్‌ను ఫోనులో సంప్రదిం చగా, పట్టణంలోని గోలిడొంక, సమీప గ్రామం చక్రాయపాలెంలో ఇన్సులేటర్లు దెబ్బతిన్న కార ణంగా సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. పునరుద్ధరణ ప్రయత్నాల్లో ఉన్నామని, మరో గంటన్నరకు సరఫరావస్తుందని సమాధానమి చ్చారు.

లెదర్ ఫుట్‌వేర్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి



దుగ్గిరాల: ప్రతి నియోజకవర్గం, మండల కేంద్రాల్లో లో లెదర్ ఫుట్‌వేర్ కాంప్లెక్స్‌లను ప్రభుత్వం నిర్మించాలని దుగ్గిరాల మండల చర్మకార సంఘ అధ్యక్షుడు కొమ్మూరి రవికు మార్ ప్రభుత్వాన్ని కోరారు. దుగ్గిరాల ఎస్సీ కమ్యూనిటీ హాలు దగ్గర శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్మకారులకు, డప్పు కళాకారులకు రూ. 2 లక్షల రుణం అందజేసి, వారి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్‌కి సభ్యుల సమక్షంలో తీర్మానం చేసి అం దజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.రా జారావు, ఎ.ధనుంజయ్, ఎస్. కోటేశ్వరరావు, కె. సుబ్బారావు, ఎస్.ప్రకాష్, నతానియేలు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కష్టపడాలి



మంగళగిరి టౌన్: లక్ష్య సాధనకు బాలబాలి కలు కష్టపడి చదువుకోవాలని ఆంధ్రప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం ముఖ్య సలహాదా రులు అద్దేపల్లి గణపతి సూచించారు. మంగళ గిరి నగర పరిధిలోని చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో శనివారం పుట్టినరోజు వేడుక లను జరుపుకున్నారు. అనంతరం శరణా లయం నిర్వాహకులు, బాలబాలికలు గణ పతిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమం లో శ్రీ లక్ష్మీ నరసింహ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మోహనరావు, ఆంధ్రప్రదేశ్ జియో జీఎం అనూఫ్, షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దుగ్గిరాల: ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో 2003 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. రెండు దశాబ్దాల అనంతరం ఒక్కచోట కలవ డంతో సందడి నెలకొంది. ఒకరినొకరు ఆత్మీ యంగా పలకరించుకున్నారు. ఈ సమావేశా నికి పూర్వ ప్రధానోపాధ్యాయులు ఏడుకొం డలు అధ్యక్షత వహించారు. విద్యా బుద్ధులు నేర్పించి ఉన్నత శిఖరాలకు అధిరోహించడా నికి కృషి చేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

చిన్నారుల్లో సృజనకు పదును

- ఉచిత వేసవి శిక్షణ శిబిరం
- కన్నెగంటి ఫౌండేషన్ నిర్వహణ



డ్రాయింగ్ శిక్షణలో చిన్నారులు

తెనాలి: వేసవి సెలవులు బడి చదువులకు విరా మం... పిల్లలకు ఆటవిడుపు. సెలవుల్లో కేవలం ఆటలతోనే సరిపెట్టకుండా వారిలో సృజనను పెం పొందించే మార్గాలను అన్వేషిస్తుంటారు తల్లిదం డ్రులు. ఏదొక అంశంలో శిక్షణను ఇప్పిస్తుంటారు. లలిత కళలపై ఆసక్తి కలిగిన పిల్లలు కూడా అటుకేసి చూస్తుంటారు. అలాంటి చిన్నారులకు పట్టణానికి చెందిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్ సహకారం అందిస్తోంది. తెలుగు, సం స్కృత భాషలు, కూచిపూడి నృత్యంతో సహా ఆరు అంశాల్లో ఏటా ఉచితంగా శిక్షణనిస్తోంది.

భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంతో కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్ 2005లో ఆవిర్భవించింది. అప్పట్నుంచి కరోనా విపత్కర పరిస్థితులు మినహా ప్రతి వేసవి సెలవుల్లోనూ దాదాపు 45 రోజులపాటు ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. స్థానిక హిందీ ప్రేమీమండలి వేదికగా నిర్వహిస్తూ వచ్చిన ఈ శిక్షణ శిబిరాన్ని ఈ వేసవి నుంచి నాజరుపేట లోని శ్రీఅరవింద విద్యాకేంద్రానికి మార్పు చేశారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5.30 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం, యోగ, చిత్రలేఖనం, తెలుగు, సంస్కృతంలో శిక్షణనిస్తున్నారు. ఆయా అంశాల్లో



డ్రాయింగ్, సంగీతం బ్యాచ్‌తో ఉపాధ్యాయులు

ప్రముఖులైన ఉపాధ్యాయులతో శిక్షణను ఇప్పిస్తు న్నారు. ఒక్కో చిన్నారి ఒకటికి రెండు మూడు అం శాల్లో శిక్షణ తీసుకుంటున్నారు.

ఆరంభం నుంచీ ఇక్కడ వివిధ అంశాల్లో శిక్షణ తీసుకున్న విద్యార్థులు పాఠశాలల్లో, కాలేజీల్లో ప్రద ర్శనలివ్వటం చేస్తున్నారు. బేసిక్స్ నేర్చుకున్న చిన్నా రులు, తర్వాతి కాలంలో మరింతగా శిక్షణ తీసుకుం టూ రాణిస్తున్నారని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కన్నెగంటి రామరాయ చౌదరి వెల్లడించారు.

శిక్షణ శిబిరంలో స్థానికులే కాకుండా ఇతర ప్రాం తాల్లో ఉంటూ, సెలవులకు తాత, నానమ్మల ఇళ్లకు వచ్చిన చిన్నారులు కూడా ఇక్కడ వివిధ అంశాలను నేర్చుకోవటం విశేషం! వీటితోపాటు క్రమశిక్షణగా మెలగటం, తల్లిదండ్రులపై ప్రేమగా ఉండటం, పెద్దలను గౌరవించటం కూడా అలవరుస్తున్నారు.

రెండు అంశాలు నేర్చుకుంటున్నా



స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాకు డ్రాయింగ్, సంగీతం అంటే ఇష్టం, ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో గత రెండేళ్లుగా వీటిలో శిక్షణ తీసుకుంటున్నా. బేసిక్స్ వచ్చాయి. సొంతంగా బొమ్మలు వేయగలుతున్నా.

– గుంపెన దీప్తి, 8వ తరగతి

లలిత కళలంటే ఇష్టం



స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాకు డ్రాయింగ్, సంగీతం అంటే ఇష్టం, ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో గత రెండేళ్లుగా వీటిలో శిక్షణ తీసుకుంటున్నా. బేసిక్స్ వచ్చాయి. సొంతంగా బొమ్మలు వేయగలుతున్నా.

– మురికిపూడి శ్రీదేవి, 9వ తరగతి

శిక్షణ కోసం రోజూ తెనాలికి



మా ఊరు కొల్లిపర మండలం చక్రాయపాలెం. తూములూరులోని సరస్వతి శిశుమందిర్‌లో ఏడో తరగతి చదువుతున్నా. రెండేళ్లుగా ఫౌండేషన్ ఇస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నా. గత సంవత్సరం డ్యాన్స్, డ్రాయింగ్, తెలుగు నేర్చుకున్నా. ఈసారి వాటితోపాటు సంస్కృతంలోనూ శిక్షణ తీసుకుంటున్నా.

– అమ్మిశెట్టి జయశ్రీ, 7వ తరగతి

సెలవులకని వచ్చి శిక్షణ



స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాకు డ్రాయింగ్, సంగీతం అంటే ఇష్టం, ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో గత రెండేళ్లుగా వీటిలో శిక్షణ తీసుకుంటున్నా. బేసిక్స్ వచ్చాయి. సొంతంగా బొమ్మలు వేయగలుతున్నా.

– వేజంద్ల విశాల్, 8వ తరగతి

ఘనంగా సువర్ణ భారతి క్షేత్రం భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న స్వామీజీ

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులో వివేకానంద సెంట్రల్ స్కూలు దగ్గర నూతనంగా నిర్మించనున్న శ్రీసువర్ణ భారతీ క్షేత్రం (సరస్వతి దేవాలయం) భూమిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు స్వామీజీల ఆధ్వర్యంలో వేదపండి తులు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి సరస్వతి దేవాలయం లక్ష పలకలతో తెనాలిలో నిర్మించటం గొప్ప విషయమని చెప్పారు. సరస్వతి దేవి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. పెద్దపులిపాక శ్రీవిజయ రాజరాజేశ్వరి శ్రీవిద్యా పీఠం పీఠాధిపతులు శ్రీవాసుదేవానందగిరి స్వామి భూమిపూజలో పాల్గొని విశేష ప్రవచనం చేశారు. విజయవాడలోని అష్టాక్షరి ఆశ్రమం నుం డి శ్రీమన్నారాయణ అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. ఇక్కడి గంగానమ్మపేటలోని శ్రీవి ద్యాపీఠం, శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెం కట కృష్ణమూర్తి, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం దంపతులు, టీటీడీ దాసస్వామి ప్రాజెక్టు కృష్ణ–గుంటూరు జిల్లా అధ్యక్షుడు గడ్డి పాటి శ్రీనివాసు (వాసు), కార్యదర్శి రావూరు సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరరావు, గొడవర్తి సాయి హరేరామ్ పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

జూనియర్ ఇంటర్ సప్లిమెంటరీలో వివేక విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో స్వామీజీ భాస్కరానంద సరస్వతి, వీరనారాయణరావు

తెనాలి: ఇంటర్మీడియెట్ బోర్డు శనివారం ప్రకటిం చిన జూనియర్ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలి తాల్లో వివేక విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థా యిలో ఉత్తమ మార్కులు సాధించినట్టు సంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు తెలి యజేశారు. ఎంపీసీ గ్రూపులో పి.సుహానా, ఎస్ క్రిష్ణ పియలు 467/470 మార్కులు సాధించగా, వేదవ ర్షిణి, ఎల్.లిఖిత, అస్రఫ్‌లు 465 మార్కులు సాధిం చినట్టు తెలిపారు. కొత్తపేటలోని వివేక పబ్లిక్ స్కూ లులో సాయంత్రం జరిగిన అభినందన సభలో ఆయా విద్యార్థులను సత్కరించి, జ్ఞాపికలను అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ విద్యార్థులు జె.పవన్‌సాయి, జి.నిశాంత్‌కు 464 మార్కులు వచ్చాయన్నారు. మొత్తం 20 మం ది విద్యార్థులు 460 మార్కులతో ప్రతిభను చాటటం గర్వకారణమన్నారు. బైపీసీ గ్రూపులో ఎస్‌కే మిస్బా 433/440 మార్కులతో విజయం సాధించినట్టు వివరించారు. ప్రతిభను చాటిన విద్యార్థులను స్వామీజీ భాస్కరానంద సరస్వతి అభినందించారు. సీఈవో ఉదయ్‌కిరణ్, ప్రిన్సి పాల్స్ జ్యోతి, శ్రావణి, డీన్ ఎస్.శ్రీనివాసరావు, పీడీ సునీల్, మురళి, రాంబాబు, ఠాగూర్, లావణ్య, రోజా, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు రాకుండా చూసుకోండి

- మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పను లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

కౌలు రైతులకూ 'అన్నదాత సుఖీభవ' ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

దుగ్గిరాల: నూటికి డెబ్బై శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని, వారందరికీ అన్ని ప్రభుత్వ పథకాలు అందజేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాం డ్ చేశారు. దుగ్గిరాల మండలం చిలువూరులో శనివారం ఆయన రైతులతో మాట్లాడారు. రైతు ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న మంగళగిరి వ్యవసాయ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న నిరసనలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కౌలు రైతులకు కూడా భూమి యజమానితో సంబం ధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద ఇచ్చే రూ. 20 వేలు, పంట రుణాలు, రైతుభరోసా, పంట నష్ట పరిహారాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, అమ్మి రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని జయప్రదం చేయండి



చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు

మంగళగిరి టౌన్: ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని రత్నాల చెరువులో పెంతకోస్తు పండుగను పురస్కరించుకుని శనివారం ఏసుక్రీస్తు ప్రార్థన మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తరఫున పలువురు దైవ సేవకులు సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాస్టర్ తిమోతి మాట్లా డుతూ పెంతకోస్తు పండుగ అనేది క్రైస్తవంలో ముఖ్యమైన పండుగని తెలిపారు. ప్రపంచ శాం తిని కాంక్షిస్తూ ఆదివారం ప్రపంచ ప్రార్థన దినో త్సవాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 6 గంటలకు నగర పరిధిలోని టిప్పర్ల బజారులో వున్న షాదీఖానా నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. క్రైస్తవు లందరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్య క్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మోజెస్, మోషే, దేవరాజు పాల్గొన్నారు.

డ్రైవర్స్ కాలనీలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం



ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రోడ్డుపై మురుగు నీరు నిల్వ

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్ డ్రైవర్స్ కాలనీలో పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ప్రభుత్వ వైద్యశాల వద్ద రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉంది. ఎదురుగా ఉన్న డ్రైనేజీ పగిలి ఆసుపత్రికి పది అడు గుల దూరంలో రోడ్డు మీదకు మురుగునీరు వచ్చి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ మురుగు నీటిపై దోమలు తేలియాడుతున్నాయి. సచివాలయం నుం చి డోలాస్‌నగర్ మెయిన్ రోడ్ వరకు ఏర్పాటు చేసిన డ్రైనేజీలో మురుగు నీరు ప్రవాహం నిలిచిపోయింది. డ్రైనేజీకి ఏర్పాటు చేసిన పైపుల ద్వారా వంటగది లోకి, బాత్‌రూమ్‌లోకి వస్తున్నాయని స్థానికులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు పైపైనే పూడిక తీసి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి డ్రైనేజీలో పూడిక తీసి మందులు పిచికారీ చేయాలని నివాసితులు కోరుతున్నారు.

కారు–ద్విచక్ర వాహనం ఢీ

- ఇద్దరికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం

తాడికొండ: కారు–ద్విచక్ర వాహనం ఎదురెదు రుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన శని వారం తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. మేడి కొండూరు మండలం నుంచి తుళ్లూరు మండలం పెదపరిమిలో శుభకార్యానికి కారు వెళుతోంది. ఈ సమయంలో తాడికొండ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని తాడికొండ అడ్డ రోడ్డులో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు, ద్విచక్ర వాహనం ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నఇద్దరి యువకుల్లో ఒకరికి కాలు విరిగి తలకు బలమైన గాయం కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను ఆటోలో గుం టూరు ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీ కరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినం



ఈద్గాలో నమాజు ప్రార్థనల్లో ముస్లిం సోదరులు

తెనాలి: త్యాగనిరతికి, ధర్మనిబద్ధతకు ప్రతీక అయిన ఈదుల్ అజ్‌హా (బక్రీద్) పర్వదిన వేడుకలను శని వారం పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు అత్యం త భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని దాదాపు 23 మసీదుల పరిధిలోని ముస్లింలు, ముత వల్లీలు ఉదయాన్నే నూతన వస్త్రాలను ధరించారు. తలపై టోపీ పెట్టుకుని 'అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ లాఇలాహ ఇల్లల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్‌ద్' అనే స్తోత్రాన్ని పఠించా రు. పరగడుపునే చెంచుపేటలోని ఈద్గా మైదానం చేరుకున్నారు. అక్కడ రైల్‌పేటలోని ఏక్‌మినార్ మసీదు ఇమామ్ ముఫ్తీ నజీర్ ఆధ్వర్యంలో నమాజ్ చేశారు. ఈదుల్ అజ్‌హా పర్వదిన నమాజ్‌ను పరగ డుపునే చేయాల్సి ఉంటుంది. పైగా ఖుర్బానీ...(పశు త్యాగం) ఇచ్చేవారు విధిగా ఈదుల్ అజ్‌హా నమాజ్ చదివిన తర్వాతనే ఖుర్బానీ ఇవ్వాలి. అటువంటి వారి సౌలభ్యం కోసం కొన్ని స్థానిక మసీదుల్లో ఉదయాన్నే ఈదుల్ అజ్‌హా నమాజ్ చేశారు. గాంధీ నగర్‌లోని మస్జిద్–ఏ–ఆయేషా సిద్ధిఖాలో ముఫ్తీ మహమ్మద్ ఇర్ఫాన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంట లకు, పాండురంగపేట మక్కా మసీదులో మౌలానా ఇమ్రాన్ ఆధ్వర్యంలో నమాజ్ చేశారు. వహాబ్‌రో డ్డులోని మదీనా మసీదులో ముఫ్తీ ఉస్మాన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ చేశారు. ప్రార్థనల అనం తరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాం క్షలు చెప్పుకున్నారు. ఈద్గా పక్కనే గల ముస్లిం శ్మశానవాటికకు వెళ్లి, చనిపోయిన పెద్దల సమాధు లపై పూలు చల్లి నివాళులర్పించారు. ఇంటికి చేరు కున్నా ఆర్థిక స్తోమత కలిగినవారు ఖుర్బానీని నిర్వ



నమాజ్ చేయిస్తున్న ఇమామ్ ముఫ్తీ నజీర్

హించారు. పొట్టేలును ఖుర్బానీ ఇచ్చినవారు, ఆ మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి, ఒక భాగాన్ని వారు తీసుకుని, రెండో భాగాన్ని బంధువు లకు, మూడో భాగాన్ని పేదలకు పంచిపెట్టారు. అం



మసీదులో చిన్నారుల ఆలింగనం

దువల్లనే ఈ పర్వదినాన్ని 'ఈదె ఖుర్బాన్' అని కూడా అంటారు. అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి విందుభోజనం ఆరగించి, రోజంతా సంతోషం గా గడిపారు.

భానుడి ప్రచండంతో రోడ్లన్నీ నిర్మానుష్యం

మంగళగిరి టౌన్: ఉదయం 7 గంటల నుంచి సూర్యుడు భగభగమంటుండంతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. శనివారం ఎండ వేడిమికి మంగళగిరి నగర పరి ధిలోని రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపిం చాయి. మే నెలాఖరులో కొద్దిపాటి వర్షాలు పడడంతో వాతావరణం చల్లబడినప్పటికీ గత వారం రోజులుగా భానుడు భగభగ మంటు న్నాడు. ప్రజలు రోడ్లపైకి వచ్చే పరిస్థితి కనిపిం చడం లేదు. సాయంత్రం 5 గంటల తరువాతే రోడ్లపైకి వస్తున్నారు. రోహిణి కార్తె వెళ్లే వరకు ఎండలు ఇలాగే ఉంటాయని వాతావరణ శాస్త్ర వేత్తలు చెబుతున్నారు.

ధ్వజ స్తంభం వద్ద దర్శనమిచ్చిన చీపురు

- ఆలయ పవిత్రతను కాపాడాలంటున్న భక్తులు
- షోకాజ్ నోటీస్ ఇస్తామన్న ఈవో



ధ్వజ స్తంభం వద్ద దర్శనమిస్తున్న చీపురు

మంగళగిరి టౌన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద శనివారం భక్తులకు చీపురు దర్శనమిచ్చింది. ధ్వజ స్తంభం చుట్టూ కొంత చెత్త, చీపురు ఉండడంతో పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఆలయ పవిత్ర తను కాపాడాలని అధికారులను కోరుతున్నారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో వార్తలు రావడం తో ఆలయ కార్యనిర్వహణాధికారి సునీల్‌కుమా ర్‌ను సాక్షి వివరణ కోరింది. ధ్వజ స్తంభం వద్ద చీపురు ఉంచడకూడదని, నిర్లక్ష్యంగా వ్యవహరిం చిన సిబ్బందికి షోకాజ్ నోటీసు జారీ చేస్తామని ఆయన తెలియజేశారు. పవిత్రమైన దేవాలయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

186వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు బకా యిల కోసం నిర్వహిస్తున్న దీక్షలు శనివారం 186వ రోజుకు చేరుకున్నాయి. శిబిరాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగ వెంకటేశ్వర్లు ప్రారం భించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల కుల విధానాల వల్ల 170 మందికి పైగా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. 33 సంవత్సరాల కిందట ఫ్యాక్టరీ మూతబడిందని, కార్మికుల సమస్య మాత్రం ఇంకా పరిష్కారం కాలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల తలరాత మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయ కులు వేముల దుర్గారావు, డి.నాగేశ్వరరావు, గురవయ్య, ఇస్మాయిల్, పిచ్చయ్య, సారమ్మ, దుర్గా భవాని, ఇమాంబి పాల్గొన్నారు.